48181

# వశీకరణం

ఆ రోజున తాతగారు ఇంటికి రావడమే ఏనుగు ఎక్కినంత సంబరంగా వచ్చారు. తల వాకిలి నుంచే "రాజ్యం" అంటూ అమ్మమ్మని మంద్రస్థాయిలో పిలిచారు. తాతగారితో ఇన్ని పుష్కరాలుగా కాపురం చేస్తున్న పెళ్ళీడుకొచ్చిన మనుషురాళ్ళు తనకున్నా-యీనాటికి కూడా తాతగారి పిలుపు వినగానే అమ్మమ్మ ముఖం కెంపు వన్నెకి రావడం. వదనం ముగ్ధమనోహరం కావడం ఇవి మామూలే. నిత్యం జరిగే తతంగమే!

ఆయనను చూడగానే ప్రవరుడిని చూసిన వరూధినిలాగా, హొయలు పోవడం చూస్తే ఆ వాడకే కాదు ఆ సీమకు కూడా అబ్బురంగా ఉండేది.

అమ్మమ్మ యీనాటికి అమృతం తాగిన అప్సరసలాగా" నిగ నిగలా సొగసు.

పై పొంగి పొరలు వయసు" చిన్నారి లాగా కనపడటమే కాదు. ఎందరో సౌందర్యోపాసకుల గుండెల్లో గుబులు పుట్టిస్తూ వుంటుంది!

తాతగారి దగ్గర సంస్కృతం చదువుకోవడానికి వచ్చే హుస్సేన్ ఆలి ఇస్పహుని సాహెబ్‌గారు-అమ్మమ్మని తొలిసారిగా పరిచయం చేసినప్పుడు- అమ్మమ్మ వంక తిరిగి మూడుసార్లు సలాం చేస్తూ

"సుభానల్లా!! ఖండరాత్ జతలాతీ హై కి ఇమారత్ బులంది థీ!!" అని అన్నాడు.

భాష అర్థం కాకపోయినా - ఈ మాటలు తన సౌందర్యానికి సాహెబ్‌గారు ఇస్తున్న బిరుదు అని మనస్సు కనిపించి - ఏదో సమాధానం చెప్పాలని మనస్సుకి అనిపించి - ఏమి సమాధానం చెప్పాలో - తోచక - అలవోకగా తాతగారి వంక చూస్తే - ఆయన మెచ్చుకున్నట్టుగా తలపంకించాడు.

అమ్మమ్మ స్నిగ్ధ మధురంగా చిరునవ్వు నవ్వి

"ఈ పూట మా యింట్లో దేవతార్చనకు ఉండండి" అని ఆహ్వానించింది. ఒక్క క్షణం నిశ్శబ్దం! మరుక్షణం సెలయేటిగలగలతో - నవ్వుల వెల్లువతో ఆ లోగిలి అంతా నిండిపోయింది-

ఆ రోజు రాత్రి - గున్న మావి తిన్నె మీద వెన్నెల మసలే వేళలో - ఏకాంతంలో - అమ్మమ్మ తాతయ్యని అడిగింది.

"అతగాడు అన్న మాటకి అర్థం ఏమిటి?"

"వయస్సుమళ్ళి మనవాడికి చూపు తగ్గింది" అని తాతగారు ఏదో చెప్పబోయారు.

"నేను అడిగింది అతగాడి చూపును గురించి కాదు" అని అమ్మమ్మ కొంచెం గట్టిగానే శాసించింది.

తాతగారు ఒక్క క్షణం మాట్లాడకుండా ఆ అందాల రాశివంక చూస్తూ

"అతగాడి మాటలకు అర్థం- ఇక్కడ సుందర భవనముండేదని - శిథిలం చెబుతోంది" అని తాతగారు అన్నారు.

అమ్మమ్మ మనస్సు మూగబోయింది. లిప్త కాలం, ఆ ప్రసన్నమూర్తి మహిషాసుర మర్దనిగా మారింది.

మరునాడు - పగటి వెలుగులో - అద్దం ఎదుట నిలబడి కురులు ముడివేసుకుంది - బొట్టు సరిచేసుకుంటూ అద్దాన్ని యక్ష ప్రశ్నవేశింది.

"ఇది శిధిలమా? సుందర భవనమా?"

అద్దం సమాధానం చెప్పే లోపల తాతగారి కంఠం వినిపించింది.

చిన్నారి నీ సొగసే
వెన్నెలల్లిన చాందిని
వయ్యారి నీ వలపే
మరు మల్లెలు విరబూసిన
గుమ గుమ పందిరి.

అమ్మమ్మ ముఖంలో చింతలన్నీ ఆమడ దూరం పారిపోయాయి. ఆయనకు అంటి అంటనంత దూరంలో నిలబడి కొంటెగా ఆ గండు కోయిలని అడిగింది.

మరి తమరెవరో . . . ?

తాతగారు అద్దంలోని తన అద్వైతాన్ని చూసుకున్నాడు - నల్ల చలువ రాయిలా చెక్కిన నీటైన విగ్రహం .. తెలుపు నలుపుల కలనేతగా గుబురు మీసం -

మెరుపులు దాచుకున్న వర్షపు రాత్రి లాంటి దట్టమైన జులపాల జుట్టు - వంగ పండు ఛాయ పట్టు పంచ - మల్లెపూలవంటి తెల్లటి లాల్చి!

ఇహం దాటి పరం కోసమని జారుముడి వేస్తున్న 'శిఖ' పండితుడిని పామరుడిని ఒకే త్రాసులో తూచగల సమదృష్టి! వేదాన్ని, అపరాధ పరిశోధన నవలని - ఒకే ఏకాగ్రతతో చదవగల సాహిత్య పిపాసి! సాము చేసిన చేత్తో య
వాయించగల సౌకుమార్యం.

ఇవన్నీ అమ్మమ్మకు కనిపిస్తున్న దృశ్యాలు.

తాతయ్య మనసు పరం నుంచి ఇహానికి మళ్లింది. మనస్సు మమత యీ పృథ్వీ మండలం పైకి కవ్వించింది.

"మాట్లాడరేం?" అని అమ్మమ్మ కవ్వించింది. ఆ లాస్యం ముందు తాతయ్య నటరాజు అయ్యాడు -

"అందానికి అందం నేనే
జీవన మకరందం నేనే
మలయానిల ఆలనలో
పదే పదే పరవశం బై
గానమేలు ఎల కోయిల
గళ మధురిమ నేనే"

ఈ కోలాహలం ఎంతసేపు సాగేనో కాని "నాన్నా ప్లీజ్!" అంటూ మా అమ్మ కంఠం అర్థించేసరికి ఎక్కడి దొంగలు అక్కడే గుప్-చుప్!!

తాతగారి కంఠం వినగానే అమ్మమ్మ తులసి కోట దగ్గర నుంచే ఏమిటి విశేషం అన్నట్టుగా ఆయన వంక చూసింది.

తాతగారు వెయ్యి ఇళ్ళ పూజారి. ఆయనకు లక్ష వ్యాపకాలు. సవాలక్ష వ్యవహారాలు.

ఇంటికి రాగానే - అమ్మమ్మ ఎక్కడ వుంటే అక్కడికి వెతుక్కుంటూ వెళ్ళి - జరిగిన వ్యవహారాలన్నీ పూసగుచ్చినట్టు ఆవిడకి చెప్పవలసిందే! ఆవిడ మెప్పు పొందవలసిందే!!

"వారిజా ముఖిగారు వస్తున్నారు" అని తాతయ్య అనగానే అమ్మమ్మ ముఖంలో కనిపించిన ఆనందానికి హద్దు లేదు. ఉషారుగా లేచి తాతయ్య దగ్గరకు వచ్చి "ఎప్పుడు వస్తున్నారు?" అని అడిగింది.

"రేపు ఉదయం వస్తున్నారు. మన దగ్గర రెండు రోజులు ఉంటారుట."

ఆ మాట వినగానే ఆధ్యాత్మ రామాయణం కీర్తనలు మననం చేసుకుంటున్న ఆవిడ ఒక్క క్షణంలో ఒక్క బృహత్ కార్యక్రమాన్ని చేపట్టింది.

స్వాతంత్ర్య దినోత్సవానికి ఎర్రకోట దగ్గర

రిపబ్లిక్‌డే నాడు రాష్ట్రపతి భవనం దగ్గర జరిగే భారీ ఏర్పాట్లు అన్నీ ఆ యింటి దగ్గర చక చకా జరిగిపోతున్నాయి.

ఎప్పుడూ శుభ్రంగా ఉండే ఇంటిని యింకా శుభ్రంగా ఉంచడం అందంగా అలంకరించడం క్షణాల మీద జరిగినట్టు జరిగిపోయాయి. గెస్టురూమ్ సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దడం జరిగింది.

మరునాడు ఉదయం అమ్మమ్మ బెనారస్ పట్టు చీర, తాతయ్య ఇంపోర్టెడు సూటులో రైల్వే స్టేషనుకు కారులో వెళ్ళారు.

ఒక పెద్ద పూల దండ - అందమైన పూల గుత్తిని వెంట తీసుకుని వెళ్ళారు.

వాళ్ళు ఇంటికి వచ్చేసరికి చేయవలసిన పనులు మా అమ్మకు నాన్నకు పురమాయించి వెళ్ళారు.

ఉదయం 9 గంటలకు ఆవిడ వచ్చింది. రవి వర్మ పెయింటింగ్‌లో లాగా, బాపు బొమ్మలాగా, అజంతా శిల్పంలాగా-మానస సరోవరంలో హంసలాగా - అలలుగా కలలుగా కదలి వస్తుంటే -

మేమంతా చిత్తర్వులులాగా నిలచిపోయాము. అంతలోనే తెప్పరిల్లుకుని - నాదస్వరంతో - పూర్ణ కుంభంతో మంగళ హారతితో ఆవిడకి స్వాగతం పలికాము.

పరమేశ్వరుడిని కైలాసంలో వదిలి భూలోకంలో సంచారం చెయ్యడానికి వచ్చిన పార్వతీ దేవి లాగా వున్న ఆ వ్యక్తి మా వంక చూసి చిరునవ్వు నవ్వేసరికి - మా జీవితంలో అమృతం కురిసినట్లు అనిపించింది.

మా అమ్మాయి కాత్యాయని. మా అల్లుడు సదాశివం. మా మనుమరాలు మీనాక్షి అంటూ మా అందరిని తాతగారు పరిచయం చేస్తూంటే, ఆవిడ నా వంక చూసి చిరునవ్వు నవ్వి నన్ను దగ్గరకు తీసుకుని "రాజ్యం చిన్నప్పుడు నీలాగానే ఉండేది" అని అన్నది.

ఆ రెండు రోజులు ఎంత ఉల్లాసంగా, ఎంత సరదాగా గడిచిపోయాయో చెప్పలేను.

అమ్మమ్మ, తాతయ్య వారాజా ముఖిగారు పసి పిల్లలులాగా - కాలేజీ స్టూడెంట్సులాగా - నవ దంపతులలాగా ఆ హడావిడి, అల్లరి చూశి తీరవలసిందే కాని చెప్పడానికి వీలు కాదు.

తీయని కల కరిగిపోయే సమయం వచ్చింది.

అమ్మమ్మ పెట్టిన కంచి పట్టు చీరె కట్టుకుని ఆవిడ బయలు దేరుతుంటే

అమ్మమ్మకు కన్నీరు ఆగలేదు. ఆవిడకు వీడ్కోలు చెబుతుంటే తాతయ్య కంఠం గద్గదమైంది.

స్టేషను నుంచి ఇంటికి వచ్చిన తరువాత అమ్మని అడిగాను "ఆవిడ మనకు ఏమవుతుంది?" అని.

"అమ్మమ్మ స్నేహితురాలు" అని మాత్రం చెప్పి వూరుకుంది. తాతయ్యను అడిగాను. ఆయన గల గలా నవ్వి " మీ అమ్మమ్మని అడుగు" అని అన్నారు.

చివరకు అమ్మమ్మనే అడిగాను...

అమ్మమ్మ మాట తప్పించడానికి ప్రయత్నం చేసింది. వస్తున్న చిరునవ్వును బలవంతంగా ఆపుకుంది.

చెప్పకపోతే నా మీద ఒట్టు అని అన్నాను.

అమ్మమ్మ క్షణం తటపటాయించింది. చివరకి ఒక నిర్ణయానికి వచ్చింది.

పెళ్ళి చేసుకుని కాపురం చేసుకుంటున్నదానివి - నీతో చెబుతే తప్పులేదులే... అంటూ ప్రారంభించింది.

ఆ రోజుల్లో మేము చాలా అమాయకంగా పెరిగాము. అన్నీ కట్టుబాట్లే. అన్నీ రహస్యాలే - వివాహం అంటే - పల్లకీలో ఎక్కి ఊరేగడమని మాత్రమే తెలుసు - ఆ తరువాత విషయాలన్నీ తెలియవు చెప్పినవారూ లేరు.

శోభనం నాటి రాత్రి - మీ తాతయ్యను - పెళ్ళి తరువాత చూడటం అదే మొదటిసారి.

నాలుగు సంవత్సరాలలో ఆయనలో ఎన్నో మార్పులు నాకు కనిపించాయి.

ఆయన నా కంటికి - రంభను చెరిచిన రావణాసురుడిలాగా, సైరంధ్రి కంటపడిన కీచకుడిలాగా, భూదేవిని ఎత్తుకుపోయిన హిరణ్యాక్షుడిలాగా కనిపించారు.

మదనుడు లేడు - విరి శరములు లేవు

ప్రమోదం లేదు పరవశత్వం లేదు

పులిని చూసిన లేడిలాగా భయంతో నిలువెల్లా వణికిపోయాను.

ఆ క్షణంలో - ఆలోచన ప్రణయం కాదు ప్రాణ రక్షణం.

వెర్రి బలంతో విదిలించి కొట్టాను - అంత దూరం వెళ్ళి పడ్డారు.

ఆ రాత్రి మా ఇద్దరికి ఏకాదశి.

మరునాడు- సంగతి తెలిసిన పెద్దలు - నా కాపురం ఎక్కడ గంగపాలు అవుతుందోనని ఎంతో భయపడ్డారు. శత విధాల ఆలోచించారు.

చివరకు మా అదృష్టం పండి - వారిజా ముఖి గారు మా వూరు వచ్చారు. ఆవిడ సామాన్యురాలు కాదు. రంగాజమ్మ, చింతామణి, మధురవాణి కోవకు చెందిన మనిషి

నన్ను శిష్యురాలిగా స్వీకరించడానికి ఆవిడ అంగీకరించారు.

మూడు పున్నములు, రెండు అమావాస్యలు నన్ను తీర్చిదిద్దారు.

మనస్సులోని భయం పటాపంచలు అయింది.

పార్వతీ పరమేశ్వరుల తత్వం తెలిసింది. దాని వల్లనే యీనాడు యీ బ్రతుకు

మూడు పూవులు ఆరుకాయలుగా వుంది.

స్వర్గం భూమి మీదనే లభ్యమవుతోంది.

ఆవిడ ఋణం ఎన్నటికి తీర్చుకోలేము.

"ఆవిడ దగ్గర ఏమి నేర్చుకున్నావు" అని అమ్మమ్మని అమాయకంగా, కొంటెగా అడిగాను.

జీవన తొలి సంధ్యలోని ముచ్చటలేవో, అమ్మమ్మ మనస్సులో మెసిలాయి.

బుగ్గలు కెంపువన్నె కొచ్చాయి.

నా వంక చూడకుండా- తాతయ్య సూటు బీరువాలో పెడుతూ-

చిరునవ్వుగా - నాకు మాత్రం వినబడేలాగా నెమ్మదిగా "వశీకరణం" అని అంది.

# భవసాగరం

తెల్లవారు ఝామున బ్రహ్మ మూహూర్తంలో రామచంద్రయ్యకు మెళుకువ వచ్చింది. దూరంగా ఉన్న ఆలయం నుంచి సుప్రభాత గీతం వినబడుతోంది. నిత్యకృత్యాలు - పూర్తి చేసుకున్నాడు. అనుష్ఠానం యధావిధిగా చేసుకున్నాడు. ఇల్లంతా కలయ తిరిగాడు. ఒక్క క్షణం పొయ్యి దగ్గర ఆగాడు. "మూడు రోజులు పడుకున్నది చాలు. బయటకు దయచేయి" అంటూ ఆజ్ఞాపించాడు. మంచి నిద్దర చెడగొట్టినందుకు యీయనను తన భాషలో మ్యావ్! మ్యావ్! మంటూ తిట్టి పిల్లి బయటకు పారిపోయింది.

రామచంద్రయ్య చిరునవ్వు నవ్వి అద్దంలో తన ప్రతిబింబం చూసుకున్నాడు.

బవిరి గడ్డం, విభూతి పట్టెలు, నుదుటి కుంకం బొట్టు, హిమాలయం మీద నుంచి ప్రవహించే జలపాతంలాగా తెల్లటి యజ్ఞోపవీతం. వయస్సు మీద పడ్డా, ముదిమి కనిపించని కండలు తిరిగిన శరీరం.

ఆ యింట్లో మిగిలిన నాలుగు సామాన్లు తీసుకుని బయటకు వచ్చాడు.

ఉషోదయం అవుతోంది. తూర్పు దిక్కు అరుణం శ్వేతమవుతోంది.

"వెంకన్నా!" అని పిలిచాడు.

ఎదురుగా రిక్షాలో కూర్చున్న ఆ వ్యక్తి రామచంద్రయ్య దగ్గరకు వచ్చాడు. ఆయన తన దగ్గర ఉన్న సామానులు అతనికి ఇస్తూ "వాడుకో" అని అన్నాడు. ఎదుటి మనిషి ప్రశ్నార్ధకంగా చూశాడు. ఈయన చిరునవ్వు నవ్వి.

'వాటి అవసరం తీరిపోయింది' అని అంటూ చేతిసంచీ తీసుకుని ముందుకు నడిచాడు. వెంకన్న ఏదో అడిగాడు. ఆయన వినిపించనట్టుగా ముందుకు సాగిపోయాడు.

తెల తెల్లవారింది. ఉదయాద్రిని తెల్లవెలుగు వచ్చింది.

సాగిన పాదం నడమంత్రపు సిరిమంతుల లోగిలి ఎదుట ఆగింది.

సౌమ్యంగానే పిలిచాడు. "ఈశ్వరరావు గారూ"

ఆయనకు పిలుపు వినిపించింది - ప్రళయకాల రుద్రుడిలాగా బయటకు వచ్చాడు.

"మళ్ళీ వాయిదా అడగటానికి వచ్చారా? సామాన్లు నాలుగు బయట పారేస్తేనే